బీజేపీకి రైతు సెగ

పంజాబ్, హర్యానాల్లో వ్యతిరేకత

- ఆ పార్టీ అభ్యర్థులను ఓడించాలని ప్రజలకు రైతు సంఘాల నేతల పిలుపు
- ప్రచారానికి వస్తే.. బీజేపీ అభ్యర్థులను అడిగేందుకు 11 ప్రశ్నలు సిద్ధం
- పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత డిమాండ్ ప్రధాన అంశం
- 'ఢిల్లీ చలో'కు అడ్డంకులు, రైతులపై బుల్లెట్లు ప్రయోగించడంపై ఆగ్రహం

బీజేపీకి సంధించిన ప్రశ్నావళిని చూపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

చండీగఢ్, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని పంజాబ్, హర్యానాలో రైతులు గట్టి దెబ్బ కొట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నూతన సాగు చట్టాల ఎపిసోడ్ నుంచి కమలం పార్టీ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. మోదీ సర్కార్ హామీలతో ఏడాది పాటు సాగిన రైతాంగ ఉద్యమాన్ని విరమించిన అన్నదాతలు.. ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో కేంద్రం మోసం చేసిందని ఆగ్రహంగా ఉన్నారు. డిమాండ్ల సాధనకు చేపట్టిన 'ఢిల్లీ చలో'కు అడ్డంకులు సృష్టించడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన విధంగా బుద్ధి చెబుతామని పంజాబ్, హర్యానా రైతులు హెచ్చరిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులను ఓడించాలని రైతు సంఘాల నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో అడిగేందుకు *11* ప్రశ్నలను సిద్ధం చేశారు. ఇందులో ఎంఎస్పీకి చట్టబద్ధత, రైతు రుణాల మాఫీ, ఇటీవల చేపట్టిన 'ఢిల్లీ చలో' కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి.

ఓట్లడిగే హక్కు ఆ పార్టీకి లేదు..

ఎస్కేఎం సీనియర్ నేత, ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రేమ్ సింగ్, బీకేయూ(లఖోవాల్) మీడియాతో మాట్లాడుతూ బీజేపీ సర్కార్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఒక 'రైతు, ప్రజాస్వామ్య, సమాఖ్య' వ్యతిరేక పార్టీ అని, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రజలను ఓట్లడిగే హక్కు ఆ పార్టీకి లేదని, ఆ పార్టీని ప్రజాస్వామిక, శాంతియుత పద్ధతిలో వ్యతిరేకిస్తామని, ప్రశ్నిస్తామని ప్రేమ్ సింగ్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులను ప్రశ్నించేందుకు తాము సిద్ధం చేసిన ప్రశ్నలను రెండు రాష్ట్రాల రైతులకు పంపుతామని తెలిపారు.

పలు గ్రామాల్లో ప్రవేశం నిషేధం

మరోవైపు ఇప్పటికే పంజాబ్, హర్యానాల్లోని పలు గ్రామాల్లోకి బీజేపీ నేతల ప్రవేశాన్ని నిషేధించారు. 'రైతులను ఢిల్లీలోకి రానివ్వలేదు. గ్రామాల్లోకి బీజేపీ నేతలు రాకుండా నిషేధిస్తున్నాం' అని రైతులు పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల 'ఢిల్లీ చలో' ఆందోళన కార్యక్రమంలో పంజాబ్ సరిహద్దుల్లో మరణించిన యువరైతు శుభకరణ్‌కు నివాళిగా కొన్ని గ్రామాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. 'నేను చేసిన తప్పేంటి? మీ(కేంద్ర ప్రభుత్వం) హామీలను గుర్తుచేయడానికే ఢిల్లీ రావాలనుకొన్నాను' అని అందులో రాసివున్నది.

రైతుల 11 ప్రశ్నలు

1. రైతులపైకి బులెట్లు, టియర్ గ్యాస్ ఎవరు ప్రయోగించారు?
2. యువ రైతు శుభకరణ్‌ను ఎందుకు కాల్చిచంపారు?
3. ఎంఎస్పీకి చట్టబద్ధత ఎందుకివ్వరు?
4. లఖింపూర్ ఖీరీ బాధితులకు ఎందుకు న్యాయం చేయలేదు? అజయ్ మిశ్రాను కేంద్ర క్యాబినెట్‌లో ఎందుకు కొనసాగించారు?
5. రైతులపై పెట్టిన కేసులను ఎందుకు ఉపసంహరించుకోలేదు?
6. కార్పొరేట్లకు అప్పులను మాఫీ చేస్తున్న మీరు.. రైతు రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదు?
7. అమలు చేయబోమని హామీ ఇచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ఎందుకు ప్రవేశపెట్టారు?
8. 'కాలుష్య చట్టం' పరిధి నుంచి వ్యవసాయాన్ని ఎందుకు మినహాయించలేదు?
9. ఎలక్టోరల్ బాండ్లతో దేశాన్ని కార్పొరేట్లకు ఎందుకు అమ్మేశారు?
10. భాఖ్రా, పాంగ్ డ్యామ్‌లను పంజాబ్ నుంచి ఎందుకు లాక్కొన్నారు?
11. సిలోస్ ఏర్పాటు చేసి పంజాబ్‌లో మార్కెటింగ్ వ్యవస్థను ఎందుకు నాశనం చేస్తున్నారు?

ఎన్నికల ఖర్చులో.. 55% బీజేపీదే!

2013-23 మధ్య పదేండ్లలో అన్ని పార్టీల ఖర్చు 15,647 కోట్లు

30%తో రెండో స్థానంలో కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లో పోటాపోటీ ఖర్చు

రాజకీయ పార్టీలు చేస్తున్న ఎన్నికల వ్యయం ఆకాశాన్నంటుతున్నది. కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం.. 2013-14, 2022-23 మధ్య లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు చేసిన ఎన్నికల ఖర్చు (మీడియా ప్రకటనలు, ప్రయాణ ఖర్చులు, అభ్యర్థుల వ్యయాలు) ఏకంగా రూ.15,647 కోట్లుగా ఉన్నది. ఇందులో గత పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీదే 55 శాతం వాటా ఉండటం గమనార్హం.

ఆ తర్వాతి స్థానంలో కాంగ్రెస్ *30* శాతం ఖర్చు చేసింది. అధికారంలో రాకముందు మొత్తం ఎన్నికల వ్యయంలో తక్కువగా ఉన్న బీజేపీ వాటా.. అధికారంలోకి వచ్చిన తర్వాత అమాంతంగా పెరుగడం గమనార్హం. *2013-14*కు సంబంధించి మొత్తంలో ఆ పార్టీ ఎన్నికల ఖర్చు *29* శాతం ఉండగా.. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం *2014-15*లో అది కాస్తా ఏకంగా *48* శాతానికి ఎగబాకింది. దీనిపై అహ్మదాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సార్థక్ బాగ్చి మాట్లాడుతూ భారత పొలిటికల్ ఫైనాన్సింగ్ చట్టంలో పార్టీల వ్యయంపై పరిమితి లేదని, అయితే అభ్యర్థి చేసే ఖర్చుపై మాత్రమే పరిమితి విధించారని పేర్కొన్నారు.

–న్యూఢిల్లీ, ఏప్రిల్ 9

ఆకాశాన్నంటిన ఎన్నికల వ్యయం

2013-23 మధ్య అన్ని పార్టీల ఎన్నికల ఖర్చు **15,647 కోట్లు**

2019-20లో అత్యధికంగా **3,073 కోట్లు**

గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో..

2014
- బీజేపీ 714 కోట్లు
- కాంగ్రెస్ 516 కోట్లు

2019
- బీజేపీ 1,264 కోట్లు
- కాంగ్రెస్ 820 కోట్లు



అధికారంలో ఉంటే అలా.. లేకుంటే ఇలా!



'చెప్ప'తున్నది.. 'గుర్తు'ంచుకుంటారుగా!

అలీగఢ్ స్వతంత్ర అభ్యర్థి వినూత్న ప్రచారం

అలీగఢ్, ఏప్రిల్ 9: ఎన్నికల్లో ఓట్ల కోసం రాజకీయ నేతలు చేసే ఫీట్లు అన్నీ ఇన్నీ కావు. ఓటర్లను ఆకర్షించేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అలీగఢ్ నుంచి పోటీచేస్తున్న ఓ అభ్యర్థి కూడా వినూత్నంగా ప్రచారం చేస్తూ వార్తల్లో నిలిచారు. ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచిన పండిట్ కేశవ్ దేవ్‌కు ఎన్నికల సంఘం చెప్పుల జత గుర్తును కేటాయించింది. దీంతో తన గుర్తు ఓటర్లకు బాగా గుర్తుండాలనే తాపత్రయంతో వారిని ఆకట్టుకోవడానికి ఆయన తన మెడలో చెప్పుల దండను వేసుకొని ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. దీన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ నెల 26న రెండో దశలో అలీగఢ్ లోక్‌సభ స్థానానికి పోలింగ్ జరగనుంది. మొత్తానికి తన చెప్పుల దండ విజయ హారాన్ని మెడలో వేస్తుందో లేదో తెలుసుకోవాలంటే జూన్ 4న జరిగే కౌంటింగ్ వరకు ఆగాల్సిందే.

ఓటేయాలంటూ తల్లిదండ్రులకు లక్ష పోస్టు కార్డులు

అస్సాంలో విద్యార్థుల లేఖలు

గువాహటి: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ అస్సాంలోని కామ్‌రూప్ జిల్లాకు చెందిన లక్ష మంది విద్యార్థులు మంగళవారం తమ తల్లిదండ్రులకు పోస్ట్‌కార్డులు రాశారు. మే 7న జిల్లాలో మూడో విడతలో భాగంగా ఇక్కడ పోలింగ్ జరుగనున్నది. వందశాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని జిల్లా అధికార యంత్రాంగం 'మా ద్యూటాలోయ్, వోట్‌డానోర్ అహబాన్' (ఓటు వేయమని తల్లిదండ్రులకు విజ్ఞప్తి) ప్రచారం చేపట్టింది. కామ్‌రూప్ జిల్లా కమిషనర్, హైదరాబాద్‌కు చెందిన కీర్తి జల్లి మాట్లాడుతూ పిల్లలు వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయడం ద్వారా వారిపై భావోద్వేగ ప్రభావం ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఇది భవిష్యత్తు తరానికి పెద్దలను జవాబుదారీగా చేస్తుందని వివరించారు.

యూపీ.. నాన్‌లోకల్స్ హ్యాపీ

సోనియా గాంధీ నుంచి జయప్రద వరకూ.. కీలక మహిళా నేతలందరూ స్థానికేతరులే

లక్నో, ఏప్రిల్ 9: కేంద్రంలో అధికారం చేపట్టేందుకు దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన, *80* లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్ చాలా ముఖ్యమైనది. ఆ రాష్ట్రంలో చాలా మంది బలమైన మహిళా నేతలు ఉన్నారు. అయితే ఆసక్తికరంగా వారిలో మెజార్టీ మంది స్థానికేతరులే కావడం గమనార్హం.

సోనియాగాంధీ: కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఇటలీ దేశానికి చెందిన వ్యక్తి. ఆమె రాజీవ్ గాంధీని వివాహం చేసుకొన్న తర్వాతి నుంచి న్యూఢిల్లీలో నివాసం ఉంటున్నారు. యూపీలోని అమేథీ నుంచి *1999*లో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సోనియా.. *2004* నుంచి *2019* వరకు అదే రాష్ట్రంలోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తూ వచ్చారు.

మాయావతి: ఢిల్లీలో జన్మించిన బీఎస్పీ అధినేత్రి మాయావతి.. యూపీని తన రాజకీయ కర్మభూమిగా మార్చుకొన్నారు. పలు మార్లు ఏకంగా రాష్ట్రానికి సీఎంగా చేసిన ఆమె.. ఒక బలమైన నేతగా ఎదిగారు.

స్మృతి ఇరానీ: అమేథీ నుంచి వరసగా రెండోసారి గెలుపొందాలని ఉవ్విళ్లూరుతున్న కేంద్ర మంత్రి స్మృతిఇరానీ వాస్తవానికి ఢిల్లీ వాస్తవ్యురాలు. *2019*లో ఆమె అమేథీ నుంచి గెలిచిన తర్వాత.. తనకు తాను 'అమేథీ బిడ్డ'గా చెప్పుకొన్నారు.

మేనకా గాంధీ: ఢిల్లీకి చెందిన మేనకా గాంధీ, *1989*లో జనతాదళ్ టికెట్‌పై ఎంపీగా గెలిచారు. తర్వాత బీజేపీలో చేరి..పోటీచేసేందుకు మొదట పిలిబిత్, తర్వాత సుల్తాన్‌పూర్ ఎంచుకొంటున్నారు.

హేమమాలిని: రాజకీయ నేతగా మారిన నటి హేమమాలిని ప్రస్తుతం యూపీలోని మథుర నుంచి వరుసగా మూడో సారి పోటీచేస్తున్నారు. తమిళనాడుకు చెందిన ఆమె తన జీవితకాలంలో అత్యధికంగా ముంబైలో గడిపారు.

జయప్రద: నటి నుంచి రాజకీయ నేతగా మారిన జయప్రద.. రాజమండ్రిలో జన్మించారు. మొదట టీడీపీలో చేరిన ఆమె, ఆ తర్వాత తన రాజకీయ భవిష్యత్తు కోసం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లారు.

డింపుల్ యాదవ్: ఎస్పీ అధినేత అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ ఉత్తరాఖండ్‌కు చెందిన వ్యక్తి. ఆమె అఖిలేశ్‌ను పెండ్లి చేసుకొన్న తర్వాత యూపీని తన ఇంటిగా మార్చుకొన్నారు. *2022*లో ములాయం మరణం తర్వాత మెయిన్‌పురి ఉప ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు.

ఎంవీఏలో కుదిరిన సీట్ల సర్దుబాటు

ముంబై, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో శివసేన (యూబీటీ)-*21* స్థానాలు, కాంగ్రెస్-*17*, ఎన్సీపీ(ఎస్పీ)-*10* స్థానాల్లో పోటీ చేయడానికి అంగీకారం కుదిరింది. సీట్ల పంపకంపై గతకొన్ని వారాలుగా జరుగుతున్న చర్చలు ఫలించినట్టు ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే మంగళవారం ప్రకటించారు.

బీజేపీకి రాజ్‌ఠాక్రే మద్దతు

మహారాష్ట్రలోని బీజేపీ, శివసేన, ఎన్సీపీ కూటమికి ఈ ఎన్నికల్లో బేషరతు మద్దతు ఇస్తున్నట్టు మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే మంగళవారం ప్రకటించారు. దేశ ఉజ్వల భవిష్యత్తుకు, మోదీ లాంటి సమర్థ నాయకత్వం కోసం ఈ మద్దతు ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. దాదర్ శివతీర్థలో గుడి పాడ్వా మేళాలో ఆయన ప్రసంగించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థులను నిలబెట్టేది లేనిదీ చెప్పని ఆయన మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని ఆయన తన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అభ్యర్థి ప్రతి చరాస్తినీ వెల్లడించనక్కర్లేదు!

అభ్యర్థిత్వంపై ప్రభావం చూపితే తప్ప.. ఓటరుకు అన్నీ తెలుసుకునే హక్కేమీ లేదు

అరుణాచల్ ఎమ్మెల్యే కేసులో సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తనకు, తన కుటుంబసభ్యులకు ఉన్న ప్రతి చరాస్తిని వెల్లడించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. చాలా విలువైన, విలాసవంతమైన జీవనశైలిని ప్రతిబింబించేవి, తన అభ్యర్థిత్వంపై గణనీయ ప్రభావం చూపించేవి మినహా మిగతా చరాస్తుల విషయంలో గోప్యత పాటించే హక్కు అభ్యర్థికి ఉంటుందని స్పష్టం చేసింది. 2019లో అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజూ శాసనసభ నియోజకవర్గానికి స్వతంత్ర ఎమ్మెల్యేగా ఎన్నికైన కరిఖో క్రి కేసు విషయంలో ధర్మాసనం ఈ విధంగా స్పందించింది. కరిఖో తన భార్య, కుమారుడికి చెందిన మూడు వాహనాలు, తల్లి పేరిట ఉన్న ప్లాట్ వివరాలు వెల్లడించలేదని, తన ఆధీనంలో ఉన్న ప్రభుత్వ వసతి గృహానికి సంబంధించిన అద్దె, విద్యుత్తు, నీటి, ఫోను బిల్లుల బకాయిలు లేవని చెప్పే 'నో డ్యూ సర్టిఫికెట్' సమర్పించలేదని కాంగ్రెస్ అభ్యర్థి నూనే తయాంగ్ గతంలో గువాహటి హైకోర్టును ఆశ్రయించారు. కరిఖో ఎన్నిక చెల్లదని హైకోర్టు గత జూలైలో తీర్పు చెప్పింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ కరిఖో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

అభ్యర్థికి గోప్యత హక్కు వర్తిస్తుంది

ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అభ్యర్థికి సంబంధించిన ప్రతి ఆస్తి గురించి తెలుసుకునే సంపూర్ణ హక్కు ఓటరుకేమీ ఉండదని పేర్కొన్నది. ఓటర్ల హక్కుగా తన ఆస్తులకు సంబంధించిన వివరాలు అన్నింటినీ కరిఖో క్రి వెల్లడించాల్సిందే అని కాంగ్రెస్ అభ్యర్థి చేసిన వాదనను కూడా కోర్టు తిరస్కరించింది. ఎన్నికల కోసమని అభ్యర్థి తన జీవితం మొత్తాన్ని బహిర్గతం చేయాలనే వాదనను తాము సమర్థించడం లేదని పేర్కొన్నది. ఓటరుకు అవసరం లేదని, అభ్యర్థిత్వానికి సంబంధం లేని విషయాల పట్ల అభ్యర్థులకు గోప్యత హక్కు వర్తిస్తుందని స్పష్టం చేసింది. అభ్యర్థి తన ప్రతి ఆస్తిని వెల్లడించకపోవడాన్ని తప్పుగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. అభ్యర్థి జీవనశైలిని ప్రతిబింబించేవి, చాలా విలువైనవి అయితే తప్ప బట్టలు, షూ, ఫర్నీచర్, స్టేషనరీ, వంట వస్తువులు వంటి చరాస్తుల వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదని పేర్కొన్నది.కరిఖో ఎన్నిక చెల్లదని గతంలో గువాహటి హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేసింది. తేజూ నియోజకవర్గానికి మళ్లీ ఎన్నికలు నిర్వహించే అంశంపై స్టే విధించింది. ఎమ్మెల్యేగా కరిఖో అన్ని ప్రయోజనాలు పొందొచ్చని, శాసనసభలో బల నిరూపణ పరీక్షలో ఓటేసే హక్కు ఉండదని పేర్కొన్నది.

ఎన్నికల్లో పోటీపై ఆజాద్ యూటర్న్!

శ్రీనగర్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయకపోవచ్చునని డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) అధ్యక్షుడు, మాజీ సీఎం గులామ్ నబీ ఆజాద్ తెలిపారు. ఈ ఎన్నికల్లో అనంత్‌నాగ్-రాజౌరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్టు పార్టీ తన పేరు ప్రకటించిందని, అయితే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అనే విషయంపై తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. 2022లో కాంగ్రెస్‌ను వీడి కొత్తగా పార్టీ స్థాపించిన ఆజాద్ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తే అయనకు అది తొలి పరీక్షగా నిలుస్తుందని భావిస్తున్నారు. కాగా, ఆజాద్ ప్రకటనపై నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఒమర్ అబ్దుల్లా తప్పుబట్టారు. 'ఆజాద్‌కు బీజేపీ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ పార్టీ కోసం తప్పుకోవాలని అనుకుంటున్నారు' అని విమర్శించారు.

ఎన్నికల బరిలో లాలూ ఇద్దరు కుమార్తెలు

పాట్నా, ఏప్రిల్ 9: బీహార్‌లో ఈసారి లోక్‌సభ ఎన్నికలలో మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తెలిద్దరూ పోటీ చేస్తున్నారు. ఆర్జేడీ మంగళవారం 22 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. లాలూ కుమార్తెలు మీసా భారతి, రోహిణీ ఆచార్యలు వరుసగా పాటలీపుత్ర, శరన్ నియోజకవర్గాల నుంచి బరిలో దిగనున్నారు. ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న భారతి పాటలీపుత్ర నుంచి 2014, 2019 ఎన్నికల్లో ఓడిపోయారు.

సీఈసీకి జెడ్ క్యాటగిరీ భద్రత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల వేళ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ క్యాటగిరీ వీఐపీ భద్రత కల్పించింది. ఎన్నికల సందర్భంగా ఆయనకు ముప్పు ఉందంటూ వచ్చిన సమాచారం మేరకు ఈ భద్రత కల్పిస్తున్నట్టు కేంద్ర హోం శాఖ మంగళవారం ప్రకటించింది. దీని కింద 40-45 మంది సాయుధ సీఆర్‌పీఎఫ్ కమాండోలు ఆయనకు రక్షణగా ఉంటారు. సీఈసీకి ఇలా జెడ్ క్యాటగిరీ భద్రత కల్పించడం అరుదైన విషయంగా పేర్కొనవచ్చు. గతంలో టీఎన్ శేషన్ సీఈసీగా ఉన్నప్పుడు ఒకానొక సమయంలో ఇలా భద్రత కల్పించారు.

'రెండో విడత' బరిలో 1,210 మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ: ఈ నెల 26న జరిగే లోక్‌సభ రెండో విడత ఎన్నికల్లో 1,210 మంది రంగంలో ఉన్నట్టు ఎన్నికల సంఘం మంగళవారం వెల్లడించింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వెల్లడైన వివరాల ప్రకారం.. కేరళలోని 20 స్థానాల నుంచి 500 మంది, కర్ణాటకలోని 14 సీట్లలో 491 మంది రంగంలో ఉన్నారు. అతి తక్కువగా త్రిపురలోని ఒక లోక్‌సభకు 14, అతి ఎక్కువగా మహారాష్ట్రలోని నాందేడ్‌కు 92 మంది పోటీ పడుతున్నారు. రెండో విడత ఎన్నికలు జరిగే 12 రాష్ట్రాలు, యూటీల్లోని 88 నియోజకవర్గాల్లో 2,633 మంది నామినేషన్లు వేయగా, ఉపసంహరణ, స్క్రూటినీ తర్వాత 1,210 మంది నిలిచారు.

బీఎస్పీ అభ్యర్థి మృతి.. బేతుల్ ఎన్నిక వాయిదా

బేతుల్ (ఎంపీ), ఏప్రిల్ 9: మధ్యప్రదేశ్‌లోని బేతుల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నిక నిలిచిపోయింది. అక్కడ పోటీ చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థి అశోక్ భళావి మంగళవారం మృతి చెందడంతో ఎన్నికల ప్రక్రియను రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. దీంతో ఈ నెల 26న జరగాల్సిన ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ నరేంద్ర సింగ్ రఘువంశీ తెలిపారు. ప్రైవేట్ దవాఖానను నిర్వహిస్తున్న అశోక్‌కు గుండెపోటు రావడంతో అతడిని వెంటనే దవాఖానకు తరలించగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు ప్రకటించారు.

ఓట్ల క్రాస్ వెరిఫికేషన్‌పై 16న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఈవీఎంలలో నమోదైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలంటూ దాఖలైన పిటిషన్లు అన్నింటినీ కలిపి ఈ నెల 16న విచారించనున్నట్టు సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఒక పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ర్యాండమ్‌గా ఎంపిక చేసిన ఐదు ఈవీఎంల నుంచి మాత్రమే స్లిప్పులను లెక్కించే ప్రస్తుత పద్ధతికి విరుద్ధంగా ఎన్నికల్లో పోలైన వీవీపాట్ స్లిప్పులను పూర్తిగా లెక్కించాలని కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్ పై అభిప్రాయం చెప్పాలంటూ ఈనెల 1న ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలా గే, ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలన్న అభ్యర్థనను వచ్చే వారానికి వాయిదా వేసింది.

నా కుమారుడు ఓడిపోవాలి

కాంగ్రెస్ నేత ఏకే ఆంటోని

తిరువనంతపురం, ఏప్రిల్ 9: తన కుమారుడు, బీజేపీ అభ్యర్థి అనిల్ ఆంటోని ఓడిపోవాలని ఆయన తండ్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోని ఆకాంక్షించారు. కేరళలోని పతనంతిట్ట లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా అనిల్ ఆంటోని పోటీ చేస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలని, బీజేపీ ఓడిపోవాలని ఏకే ఆంటోని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ఈ ఎన్నికలు ఎంతో కీలకమని, అందుకే తన ఆరోగ్య సమస్యలను పక్కనబెట్టి ఎన్నికల ప్రచారానికి దిగినట్టు తెలిపారు. తనకు కుటుంబం, రాజకీయాలు రెండూ వేర్వేరని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు తన తండ్రి వ్యతిరేకంగా ప్రచారం చేసినా తాను గెలుస్తానని అనిల్ ఆంటోని అన్నారు.

ఢిల్లీలో తృణమూల్ ధర్నా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట సోమవారం ధర్నాకు దిగిన టీఎంసీ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోగా.. మంగళవారం ఉదయం మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ వద్ద వారు తమ నిరసనను కొనసాగించారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ, ఐటీ విభాగాలకు అధిపతులను మార్చాలని డిమాండ్ చేస్తూ టీఎంసీ నేతలు సోమవారం ఈసీ ఫుల్ బెంచ్‌ను కలిశారు. అనంతరం ఈసీ కార్యాలయం ఎదుట *24* గంటల పాటు ధర్నాకు దిగారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం రాత్రి విడుదల చేశారు. అయినప్పటికీ వారంతా పోలీస్‌స్టేషన్‌లోనే ఉండి ధర్నా కొనసాగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నదని, దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌కు టీఎంసీ నేతలు మంగళవారం లేఖ రాశారు.

కేజ్రీవాల్‌కు హైకోర్టులో దక్కని ఊరట

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట దక్కలేదు. తన అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. కేజ్రీవాల్ అరెస్టు, రిమాండ్ చట్టవిరుద్ధం కాదని వ్యాఖ్యానించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ మంగళవారం తీర్పు వెలువరించారు. కేజ్రీవాల్ అరెస్టుకు ఈడీ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారని ఆప్ పేర్కొన్నది. ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి సౌరవ్ భరద్వాజ్ మీడియాతో మాట్లాడుతూ మద్యం పాలసీ కేసు కేజ్రీవాల్, ఆయన పార్టీని అణచివేసేందుకు జరిగిన ఒక పెద్ద రాజకీయ కుట్ర అని ఆరోపించారు. హైకోర్టు తీర్పు తమకు ఆమోదయోగ్యంగా లేదని, దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపారు. మద్యం పాలసీ కేసుల్లో దర్యాప్తు చేస్తున్న ఈడీ, సీబీఐ ఇప్పటి వరకు ఒక్క రూపాయి అక్రమ సొమ్ము కూడా రికవరీ చేయలేదని అన్నారు. ఈ కేసు